# వరికి తెగుళ్లు.. రైతన్నకు తిప్పలు

- పంటలకు ఆశిస్తున్న అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు
- నాట్లు వేసి 60 రోజులైనా ఎదుగుదల లేక ఎర్రబారిన పైరు
- మందులు పిచికారీ చేసినా అంతంతే ఫలితం


హుజూర్‌నగర్ మండలంలో అగ్గితెగులు సోకిన వరి పైరు


బూరుగడ్డలో పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంటలను తెగుళ్లు వెంటాడుతున్నాయి. వరికి అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు వంటి తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. వీటితో పాటు వరికి ఆకుమచ్చలు, పచ్చపురుగు ఆశించింది. పైరు ఎదుగుదల లోపించి వరి ఎర్రబారి, మచ్చలు ఏర్పడుతున్నాయి. వరిలో ఎదుగుదల లేదని మోతాదుకు మించి యూరియా వేస్తుండడంతో అగ్గితెగులు సోకుతోందని రైతులు వాపోతున్నారు. వాతావరణ మార్పులు, రాత్రి సమయంలో చలి తీవ్రత, మంచు కురవడం, ఉష్ణోగ్రత సమతుల్యత లేకపోవడంతో వరి పంటకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. హుజూర్‌నగర్ మండలంలో సుమారు 28 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేయగా అందులో సుమారు 5 వేల ఎకరాల వరి పంటకు అగ్గితెగులు, పచ్చపురుగు, కాండం తొలుచు పురుగు (రెక్కల పురుగు), సుడిదోమ వంటి తెగుళ్లు సోకాయి. ఎకరాకు రూ.18 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేశామని, తెగుళ్లతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 20 బస్తాలు కూడా దిగుబడి వస్తుందో రాదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మందులు పిచికారీ చేసినా..**

వరికి సోకే తెగుళ్లు, పురుగుల నివారణకు రైతులు రకరకాల రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా అగ్గితేగులు, ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఉధృతి తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ఇక్కడి మందులు సరిగా పనిచేయడం లేదని గుంటూరు వెళ్లి రసాయనిక మందులు తెచ్చి పిచికారీ చేసినా తెగుళ్లను నివారించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి సరైన మందులు సూచించాలని కోరుతున్నారు.

### పైరు ఎదుగుదల లేదు



వరి నాట్లు పెట్టి 60 రోజులైనా పైరులో సరైన ఎదుగుదల లేకపోవడంతో యూరియాను మూడుసార్లు వేశాం. వరి పైరుకు కాండం తొలుచు పురుగు, దోమ, రెక్కల పురుగుతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే మూడు సార్లు పురుగు మందులు పిచికారీ చేశాం. అయినా పురుగు ఉధృతి తగ్గలేదు. వ్యవసాయ అధికారులు స్పందించి సరైన మందులు సూచించాలి.

– బత్తుల సైదులు, రైతు అమరవరం

### వాతావరణంలో మార్పుతోనే తెగుళ్లు



రైతులు మోతాదుకు మించి యూరియా వాడటంతో వరికి అగ్గితెగులు సోకుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉండడం, చలి తీవ్రత వల్ల వరికి కాండం తొలుచు పురుగు, సుడిదోమ, అగ్గి తెగులు వ్యాప్తి చెందుతుంది. పొలంలో రాత్రి సమయంలో నీటి నిల్వ లేకుండా చూడాలి. అగ్గితెగులుకు ట్రైసైక్లోజోల్ ఎకరాకు 1.20 గ్రాములు, ఫుజి 2 ఎంఎల్, గెలీలియో 2 ఎంఎల్ వాడాలి. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టప్ హైడ్రాక్లోరైడ్ 2 గ్రాములు, తకుమి 2 ఎంల్, కోరాజెన్ 60 ఎంఎల్ ఎకరం పొలానికి పిచికారీ చేయాలి.

–రావిరాల స్వర్ణ, ఏఓ,హుజూర్‌నగర్

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


నేలమర్రిలో ఎండిపోయిన వరిపైరును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : మండలంలోని ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతంలో సాగు చేసిన వరిపైరు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు కోరారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన పోరుబాటలో భాగంగా సోమవారం మండలంలోని నేలమర్రిలో ఎండిపోయిన వరిపైర్లను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ కాలువలకు నీటిని విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో వరి పంట ఎండిపోతోందని, పట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ కాలువలకు సాగునీరు విడుదల చేయాలని కోరారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

# వారబందీ పేరుతో సాగునీరు బంద్


ఎత్తిపోతల పథకానికి తాళం వేసిన సిబ్బంది

మునగాల : వారబందీ పేరుతో సాగర్ ఎడమ కాలువపై గల పలు ఎత్తిపోతల పథకాల నుంచి పంటలకు సాగు నీటి విడుదలను బంద్ చేశారు. సోమవారం ఎత్తిపోతల పథకాలకు నీటి పారుదల శాఖ అధికారులు తాళాలు వేసి మూసివేశారు. దీంతో పంటలు ఎండిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తీరా పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీటిని నిలిపివేస్తే నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే విద్యుత్ సక్రమంగా లేకపోవడం, తరచూ మోటార్లు మరమ్మతులకు గురికావడంతో ఇప్పటికే చివరి భూములను సాగునీరు సక్రమంగా అందడం లేదు. దీనికి తోడు ఎత్తిపోతల పథకాల మూసివేయడంతో వరి పైర్లు ఎండిపోతాయి. పంట చేతికి వచ్చే తరుణమిది ఈ సమయంలో సాగునీరు అందకపోతే రైతులు నష్టపోతారని.. నీటిపారుదల శాఖ అధికారులు వారబందీ విధానం ఎత్తివేసి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీటిని విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు.

# ముగిసిన కబడ్డీ క్రీడా పోటీలు


ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

కోదాడ : కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా జరిగిన 45 నుంచి 60 సంవత్సరాల మోస్ట్ సీనియర్ కబడ్డీ కేబీ మెమోరియల్ చాలెంజర్ ట్రోఫీ క్రీడల పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు కబడ్డీ క్రీడాకారులు ఉత్సహంగా పాల్గొన్నారు. మొదటి బహుమతిని నల్గొండ జిల్లా తిరుమలగిరి జట్టు, రెండవ బహుమతిని ఖమ్మం జిల్లా చెరువుమాదారం జట్టు, మూడవ బహుమతిని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన జట్టు, నాలుగవ బహుమతిని కోదాడ కేబీ మెమోరియల్ జట్టు గెలుచుకున్నాయి. విజేతలకు కోదాడ మార్కెట్ వైస్ చైర్మన్ ఎస్‌కె.బషీర్ బహుమతులు అందజేశారు. హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మోర్తాల నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భూలోకరావు, కేఎస్ఎస్ రాజు, నిజాముద్దీన్, రామచంద్రగౌడ్, ఎస్ కె.బాగ్దాద్, నాజర్, సైదులు, రవీందర్‌రెడ్డి, పంది తి రుపతయ్య, సీతయ్య, కత్తి సైదులు, బాజాన్, ముస్తాఫా, శ్రీధర్‌రెడ్డి, విష్ణుమూర్తి, ధనమూర్తి పాల్గొన్నారు.

# దొంగలను వెంబడించి పట్టుకున్న పోలీసులు

అనంతగిరి: బైక్‌పై పారిపోతున్న దొంగలను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం బొజ్జగూడెంతండా సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి గల ఫ్లైఓవర్ వద్ద సోమవారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఇటిక్యాల ఫణిచంద్, షేక్ నాగుల్‌మీరా అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని విచారించగా అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గాపురంలో రాయబారపు వేలాద్రి ఇంట్లో చోరీకి పాల్పడి ల్యాప్‌టాప్, రూ.18వేల నగదు అపహరించినట్లు నిజం ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.18వేల నగదు, ల్యాప్‌టాప్, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. వీరికి సహకరించిన బోయినపల్లి భానుప్రసాద్ పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


హుజూర్‌నగర్‌రూరల్ : సీహెచ్‌ఓ పద్మను సన్మానిస్తున్న ఉదయ్‌కుమార్, తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని హోలి క్రాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అనంతరం మహిళా ఉద్యోగులను, ఇటీవల నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా యోగా పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన సీహెచ్‌ఓ పద్మను శాలువాలతో సత్కరించారు. పీహెచ్ఎన్‌ఓ నూర్జహాన్, సూపర్‌వైజర్ పద్మ, రామకృష్ణ, రత్నమేరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**ఘనంగా మహిళా దినోత్సవం**

నేరేడుచర్ల : పట్టణంలోని పెన్షనర్స్ బిల్డింగ్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలను క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి సత్కరించారు. క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, బట్టు మధు, కొణతం సీతారాంరెడ్డి, యూసుఫ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, శ్రీనివాస్‌రావు, విశ్వనాథం, పూర్ణచంద్రారెడ్డి, మాధవి, నజియాబేగం, అరుణ ఉన్నారు.


నేరేడుచర్ల : మహిళలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

## క్లుప్తంగా

### రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కోదాడ విద్యార్థి ప్రతిభ


మెడల్ అందజేస్తున్న నిర్వాహకులు

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కోదాడకు చెందిన స్టూడెంట్ కోఫోకాన్ కరాటే క్లబ్ విద్యార్థి ఎం.హిరణ్య ప్రతిభ కనబరిచినట్లు కరాటే క్లబ్ కోచ్ ఆరె.మాధవిలత సోమవారం తెలిపారు. అండర్–6 కరాటే విభాగంలో పాల్గొని కాంస్య పతకం అందుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

### జిజ్ఞాస పోటీలకు విద్యార్థుల ప్రాజెక్ట్ ఎంపిక


ధ్రువపత్రాలతో విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు పొందిన తెలంగాణ కవులు – పరిశీలన' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్ట్ జిజ్ఞాస పోటీలకు ఎంపికైంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు అక్కిరాజు స్వాతి పర్యవేక్షణలో విద్యార్థులు జే.శోభన, బి.ఆకాష్, ఎస్‌కే. తహసీన్, ఆర్.ఉమ, ఎం.ఉమామహేశ్వరి ప్రాజెక్ట్ రూపొందించారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.రామారావు విద్యార్థులను అభినందించి, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.సునంద, ఎస్.ప్రియాంక, బి.శ్రీనివాస్, ఎస్.బాలరాజు, డాక్టర్ నగేష్, బి.నాగార్జున, డాక్టర్ జె.వెంకటేశ్వర్లు, వి.లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాస్, నిఖిల్‌వర్మ, శ్రీకాంత్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

### మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

హుజూర్‌నగర్ : మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హుజూర్‌నగర్‌కు చెందిన ధూళిపాల శ్రీనివాస్ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు బి.రాజేందర్, ఆర్‌వి.మహేందర్‌కుమార్, జల్లేపల్లి వెంకటేశ్వర్లు, సినీ హీరో ఆవుల కిరణ్ పాల్గొన్నారు.

### రామాలయం నిర్మాణానికి రూ.50 వేల విరాళం

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందపురంలో పునర్నిర్మిస్తున్న శ్రీహనుమత్ లక్ష్మణ సహిత శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి దాసరి శుభాష్, రవి కృష్ణ కుటుంబ సభ్యులు సోమవారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇట్టిమల్ల శ్రీనివాస్, బెంజిమెన్, బొల్లెద్దు జైలు, క్రాంతి రాజేష్, రంజిత్ కుమార్, రామకృష్ణ, జానకి, రాములు, నారాయణ, దాసరి తులసమ్మ పాల్గొన్నారు.

### చివరి భూములకు సాగునీరు అందించాలి

మేళ్లచెరువు : మండలంలో సాగర్ ఎడమ కాలువ పరిధిలోని చివరి భూములకు సాగు నీరు అందించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు జనిగ సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముక్త్యాల బ్రాంచ్ కాలువ పరిధిలోని మేజర్ కాలువల కింద ఉన్న చివరి భూములకు నీరు అందడం లేదని, పంటలు గింజ ఏర్పడే సమయంలో సాగు నీరు అందక ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.

### రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కోదాడరూరల్ : ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని పలువురు రాష్ట్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కోదాడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని, సాగులో ఉన్న భూములన్నింటికీ రైతు భరోసా నిధులు జమ చేయాలన్నారు. వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు బోనస్ జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొల్లు ప్రసాద్, దొడ్డా వెంకటయ్య, బత్తినేని హనుమంతరావు, అన్నెం పాపిరెడ్డి, మాతంగి ప్రసాద్, కమతం పుల్లయ్య ఉన్నారు.

### 13, 14 తేదీల్లో జాతర

మోతె : మండల కేంద్రంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించబోయే తిరుపతమ్మ– గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవంలో (జాతర) భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జాతరలో భక్తులకు అన్నదానం ఉంటుందని, 14వ తేదీన కోలాట ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

### పోలీస్ స్టేషన్‌కు చేరిన 'పది' పరీక్షల ప్రశ్నపత్రాలు

మఠంపల్లి : పదవ తగరతి వార్షిక పరీక్షల పశ్నాపత్రాలు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు చేరాయి. పోలీస్ బందోబస్తుతో ప్రత్యేక అధికారి, గరిడేపల్లి ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ తీసుకొచ్చిన ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పెనుగొండ శ్రీనివాస్, బి.రాము, ఎన్.రవికుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ ఎస్‌కె.ఫాతిమా, వేముల శ్రీను, రామకృష్ణ, ఎంఆర్సీ సిబ్బంది ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ దుర్మరణం


శ్రవణ్‌కుమార్ (ఫైల్)

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్‌కుమార్ మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ కౌన్సిలర్ కస్తాల శ్రవణ్‌కుమార్ (43) సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో బైక్‌పై వెళ్తుండగా.. శాంతి స్తూపం సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. శ్రవణ్‌కుమార్ మృతి పట్ల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం శ్రవణ్‌కుమార్ మృతదేహాన్ని మంత్రి సందర్శించి నివాళులర్పించనున్నారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించనున్నారు.

### వేతనాలు విడుదల చేయాలి

గరిడేపల్లి : గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు విడుదల చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కొండ సైదులుగౌడ్ కోరారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలు రాక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. కార్మికుల జీవనం కష్టంగా ఉందని, అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రెండు నెలల జీతాలు వేయాలని ఆయన కోరారు.

### ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

నడిగూడెం : ధ్యానంతో సంపూర్ణం ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ ధ్యాన నిపుణుడు, హైదరాబాద్‌కు చెందిన నూనె వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ధ్యానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, రత్నవరం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

నడిగూడెం : విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి బి.ఉపేందర్ రావు అన్నారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు తెలంగాణ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రత్యేక అధికారి వెంకటరమణ, తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేషబోయిన మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మేకల వీరబాబు, నాయకులు కాసాని గోపీనాథ్, వెంకటేష్, వీరేశం, నవీన్‌కుమార్, ఉదయ్, అజయ్, సందీప్, బాసు పాల్గొన్నారు.

**విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత**

గరిడేపల్లి : మండలంలోని వెలిదండలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మాశెట్టి నరసింహారావు, యూత్ నాయకులు చనగాని వెంకన్నగౌడ్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రి అందజేశారు. చనగాని జగన్, ములకలపల్లి నాగరాజు, బెల్లంకొండ రఘు, సతీష్, కార్తీక్, గోపి, రాకేష్ పాల్గొన్నారు.

# రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన


హోమంలో పాల్గొన్న భక్తులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో 700 ఏళ్ల క్రితం నాటి శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బేతవోలు దొర తడకమళ్ల సీతారామచందర్‌రావు అనువంశికులు సుభద్రాదేవి, రఘువరమ్, రజినితో పాటు యాద్రాది భువనగిరి జిల్లా కలెక్టర్ మంత్రిప్రగడ హనుమంతరావు కుటుంబసభ్యులు రమేష్‌బాబు, శ్రీనివాస్‌రావు, విజయలక్ష్మి, మంత్రిప్రగడ శశిధర్, ఆలయ ఈఓ మృత్యుంజయశాస్త్రి దంపతులు పీటలపై కూర్చొని హోమం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నరగిరినాధుని నాగేంద్రబాబు, లక్ష్మప్ప, పృథ్వీ, గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి


హుజూర్‌నగర్ : సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


నేరేడుచర్లలో..

హుజూర్‌నగర్ : సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం హుజూర్‌నగర్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు బి.గోవిందరావు, గౌరవ సలహాదారు కె.వెంకటేశ్వరరావు, పట్టణ ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహచారి, కర్నె కృష్ణ, మామిడి సోమయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం నేరేడుచర్లలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు, చిలక రాజు శ్రీను, బీఆర్ఎస్ నేత రాపోలు నవీన్‌కుమార్, కొమ్మరాజు వెంకట్, భరత్, ధనమూర్తి, వెంకట్, వివేక్, సుందరయ్య, ఉదయ్ తదితరులు ఉన్నారు.

# ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా చేపట్టాలి


మునగాలలో డప్పుల ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీం అక్తర్ ఏక సభ్య కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో లోపాలను సరిచేసి, వర్గీకరణను శాస్త్రీయంగా చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ అన్నారు. ఈమేరకు సోమవారం కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్‌లో నిర్వహించిన డప్పుల ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాదిగలకు 11 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యలమర్తి రాము, ఏపూరి సత్యరాజు, పిడమర్తి వెంకట్రావు, బచ్చలకూరి వెంకన్న, కొత్తపల్లి అంజయ్య, నాగరాజు, కృష్ణ, సూర్యప్రకాష్ ఉన్నారు.

**మునగాలలో డప్పుల ప్రదర్శన**

మునగాల : తెలంగాణలో మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సీలను ఏబీసీ కాకుండా ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరించాలని, రాష్ట్ర మంత్రివర్గంలో ఇద్దరు మాదిగ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని సోమవారం మునగాల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు మాదిగ, ఎంఎస్‌పీ మండల శాఖ అధ్యక్షుడు లంజేపల్లి శ్రీనుమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు గద్దల అశోక్ మాదిగ, నాయకులు మేరిగ వెంకటేశ్వర్లు, మేరిగ ముత్తయ్య, గంట బాబు, జగదీష్, గణేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం హామీలు అమలు చేయాలి


పాలకవీడు : సమావేశంలో మాట్లాడుతున్న అనంతప్రకాష్

నడిగూడెం : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ కోరారు. సోమవారం మండల పరిధిలోని వేణుగోపాలపురంలో పోరుబాటలో భాగంగా సీపీఎం నాయకులు చేపట్టిన సర్వేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల కమిటీ సభ్యుడు రేఖ తిరపయ్య, సంపతి పిచ్చయ్య, వెంకయ్య, పుల్లయ్య, గోపి పాల్గొన్నారు.

**12 నుంచి సీపీఎం పోరుబాట**

పాలకవీడు : ప్రజా సమస్యలపై ఈ నెల 12వ తేదీ నుంచి 30 వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంతప్రకాష్ తెలిపారు. సోమవారం పాలకవీడు మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు పగడాల మట్టేష్, గుర్రం ధనమూర్తి, మాతంగి ఏసురత్నం, వీరభద్రం, పురుషోత్తంరెడ్డి, రమేష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలపై సీపీఎం సర్వే**

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో ప్రజా సమస్యలపై సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అనంతరం మఠంపల్లిలో తహసీల్దార్ ఎల్ మంగకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, పాడిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన**

హుజూర్‌నగర్ : ఎయిమ్స్ ఒలింపియాడ్ హంట్ రెండు విభాగాలుగా నిర్వహించిన సైన్స్, గణితం పోటీల్లో పట్టణానికి చెందిన గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ, రాష్ట్ర, జోనల్ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు కె.ప్రహర్ష, జి.రిషిక, సనివిక ప్రజ్ఞ, అరిష్‌రెడ్డి, జయ ఆదిత్య, పి.సారికకు ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతీ ఆడిటోరియంలో అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను పాఠశాల చైర్మన్ తుమ్మ నరిత మరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏవీ కృష్ణారావు, హెచ్‌ఎం రాజారెడ్డి, మరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పిచ్చయ్య మృతి పార్టీకి తీరని లోటు**

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శాసనాల పిచ్చయ్య (95) మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని తాజా మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య అన్నారు. హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పిచ్చయ్య మృతిచెందారు. సోమవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వెంగల్‌రెడ్డి కృష్ణారెడ్డి, షేక్ దస్తగిరి, వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు సిద్దెల భిక్షం, నాగశ్రీను, తదితరులు ఉన్నారు.

**దాసాంజనేయస్వామి ఆలయంలో పూజలు**

నడిగూడెం : మండల పరిధిలోని నారాయణపురం, సిరిపురం గ్రామాల మధ్య సాగర్ ఎడమ కాల్వ కట్టపై ఉన్న శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ చేసి 25 ఏళ్లు పూర్తిచేసిన సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం చేశారు. ఇరు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

**ముస్లింలకు ఇఫ్తార్ విందు**

అనంతగిరి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం మండలంలోని ముస్లింలకు ఉత్తమ్‌పద్మావతి యువసేవ ఆధ్వర్యంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తొగాటి వేలాద్రి హైమావతి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

**మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత**

మోతె : మోతె మండల కేంద్రానికి చెందిన ఫాతిమ గత కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామ చిన వెంకటరెడ్డి, తదితరులు పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

చిలుకూరు : మండలంలోని బేతవోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఫీడర్ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేతవోలు, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, జెర్రిపోతులగూడెం, పోలేనిగూడెం, సీతారాంతండా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

**అవకాశాలను అందిపుచ్చుకోవాలి**

కోదాడ : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త అంశాలపై పట్టు సాధించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇండియన్ అకాడమీ ఆఫ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ నిర్వాహకురాలు డి. మహిత అన్నారు. సోమవారం కోదాడలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ హెడ్సరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నేడు వీడియో కాన్ఫరెన్స్**

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం పది గంటలకు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు ఆసక్తి గల రైతులు హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.